ధర్నా చేపట్టి.. నినాదాలతో హోరెత్తించి..

- కనీస వేతనంగా రూ.18,000 చెల్లించాలని ఆశ వర్కర్ల డిమాండ్
- కడా, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట నిరసన

కొడంగల్ కడా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

కొడంగల్, జనవరి 10 : సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనంగా రూ.18,000 అమలు చేయాలని ఆశ వర్కర్లు శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణ కడా కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వెంకట్‌రెడ్డికి పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు చంద్రయ్య మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారని.. వచ్చే నెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఎం ఆ అంశాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను త్వరగా పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

యాలాల : రేవంత్ సర్కార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించడం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ, ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు నిరసన తెలిపారు. ఎన్నికలకు ముందు ఆశ వర్కర్లకు ప్రతినెలా రూ. 18,000 చెల్లిస్తామని హామీ ఇచ్చారని.. దానిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రమాద బీమా రూ.50 లక్షలు కల్పించడంతోపాటు ఇందిరమ్మ ఇండ్లలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

కనీస వేతనం చెల్లించాలి..

ఇబ్రహీంపట్నం రూరల్ : వచ్చే నెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనం చెల్లిస్తామని ప్రకటించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే రంగారెడ్డి అందుబాటులో లేకపోవడంతో గేటుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ.. 20 ఏండ్లుగా గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆశ వర్కర్లు చాలీచాలని వేతనాలతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వారికి ప్రతినెలా రూ. 18,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆశలు సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బుగ్గరాము లు, చందు, ఎల్లేశ్, యాదగిరి, మణెమ్మ, సుకన్య, లావణ్య, చంద్రకళ, విజయ, స్వరూప, మరియమ్మ, శోభ, యాదమ్మ, అలివేలు, జంగమ్మ, సునీత, రాణి పాల్గొన్నారు.

ప్రతినెలా రూ.18,000 చెల్లించాలి

పరిగి : కాంగ్రెస్ పార్టీ ఆశ వర్కర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఆశ వర్కర్ల సంఘం నాయకురాళ్లు మాధవి, ఉమాదేవి డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు శుక్రవారం పరిగిలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇంటి ఎదుట ఆశ వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే నెలలో జరుగనున్న బడ్జెట్ సమావేశాల్లో ఆశ వర్కర్లకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనంగా నిర్ణయించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు, ఫిబ్రవరి 9, జూలై 30న ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ధర్నాలో ఆశ వర్కర్లు స్వరూప, పద్మ, అరుణ, విజయలక్ష్మి, యశోద, లలిత, ఆండాళు, యాదమ్మ, అంజమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ స్పీకర్ క్యాంప్ కార్యాలయం ఎదుట..

వికారాబాద్ : తమకు కనీస వేతనాలు అందించడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్‌ను వర్తింపజేయాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్యాంప్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు నిరసన తెలిపారు. అనంతరం ఆయన పీఏకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ , ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అమృత మా ట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ. 18 వేలకు పెంచాలని.. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడంతోపాటు ఏడాదికి మూడు జతల కాటన్ యూనిఫామ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియాన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సుమిత్ర, వినోద, శోభ, విజయ, రాణి, సుశీల, లక్ష్మి, అమృత, వెంకటమ్మ, భారతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం ఇచ్చి.. శుభాకాంక్షలు తెలిపి

భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో... తలకొండపల్లి మండలానికి చెందిన తెలంగాణ సామాజిక స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రఘుముదిరాజ్, సంపత్ తదితరులు ఉన్నారు.

-కడ్తాల్, జనవరి 10

గోవిందా..హరి..గోవిందా..

భక్తులతో కిటకిటలాడుతున్న రంగారెడ్డి జిల్లాలోని చిలుకూరు బాలాజీ ఆలయం

చిలుకూరు బాలాజీ ఆలయంలోని స్వామివారు

- వైభవంగా వైకుంఠ ఏకాదశి
- కిటకిటలాడిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వైష్ణవ ఆలయాలు
- ఉదయం నుంచే భక్తుల బారులు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వైష్ణవ ఆలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వారం నుంచి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. ఆలయాల పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. చిలుకూరు బాలాజీ ఆలయం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. చిలుకూరు బాలాజీ ఆలయం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దర్శించుకున్నారు. భగవంతుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లిలో ఉన్న అనంతపద్మనాభస్వామిని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

వికారాబాద్ జిల్లాలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలో భక్తుల రద్దు



అనంతపద్మనాభస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్

షాద్‌నగర్‌లోని శ్రీవారి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ పూర్తి

సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): జలమండలికి కొత్తగా కేటాయించిన 141 మంది జూనియర్ అసిస్టెంట్స్ (పీఅండ్ఏ, ఎఫ్‌అండ్ఏ)కు రెండు రోజుల శిక్షణ పూర్తయ్యింది. గచ్చిబౌలిలోని ఎస్కీ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు 141 మందిని మూడు బ్యాచులుగా చేసి శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడో బ్యాచ్‌కు సంక్రాంతి పండుగ సెలవుల తర్వాత శిక్షణ ఇవ్వనున్నారు.

ముగిసిన జాతీయ సెమినార్

కొండాపూర్, జనవరి 10: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో లోక్‌సభ ఎన్నికలు-2024 ఫలితాల విశ్లేషణ అనే అంశంపై నిర్వహించిన రెండురోజుల జాతీయ సెమినార్ శుక్రవారం ముగిసింది. ప్రొఫెసర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెమినార్‌లో పలు విశ్వవిద్యాలయాలు, విజ్ఞాన సంస్థల నుంచి రాజనీతి శాస్త్రవేత్తలు, రాజకీయ పండితులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అవగాహన కలిగి ఉండాలి

హైదరాబాద్ ఐఐటీ డెరెక్టర్ ప్రొఫెసర్ బీఎన్ మూర్తి

చేవెళ్ల రూరల్, జనవరి 10 : విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అవగాహన కలిగి ఉండాలని, వికసిత్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని హైదరాబాద్ ఐఐటీ డెరెక్టర్ ప్రొఫెసర్ బీఎన్ మూర్తి అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండలం, దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయ ప్రాంగణం (ఐబీఎస్)లో ఇక్ఫాయ్ టెక్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ఇంటర్న్‌షిప్ సైన్స్ శిబిరం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ బీఎన్ మూర్తి హాజరై మాట్లాడుతూ.. వికసిత్ భారత్ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర గొప్పదని, దాని విశిష్టతను తెలుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. దేశ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించాలన్నారు. బెంగళూరుకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ప్రొఫెసర్ డాక్టర్ జయానంద, ఇండో ఫ్రెంచ్ సెంటర్ ఫర్ గ్రాడ్యుయేషన్ రీసెర్చ్ ఫౌండర్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్, ఐఐటీ మద్రాస్ పూర్వ అధ్యాపకుడు సుబ్రహ్మణ్యం తదితరులు శాస్త్ర సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జంటనగరాలకు చెందిన 15 కళాశాలల నుంచి దాదాపు 250 మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉపకులపతి ప్రొఫెసర్ ఎల్ఎన్ గణేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఇక్ఫాయ్ టెక్ డైరెక్టర్ కేఎల్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ ఐఐటీ డెరెక్టర్ ప్రొ.బీఎన్ మూర్తి, హాజరైన ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు

రాంగ్‌రూట్లో వచ్చి.. వాహనదారులను తిట్టి

- రోడ్డుపై కాంగ్రెస్ నాయకుల వీరంగం
- ఎవరికీ చెప్పకొంటారో చెప్పకోండంటూ హల్‌చల్
- సోషల్ మీడియాలో వైరల్

ఎదురుగా వస్తున్న పాల ట్యాంకర్‌కు అడ్డుగా నిలిపిన కారు

పాల ట్యాంకర్ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు

పరిగి, జనవరి 10 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకుల ఆగడాలకు అంతు లేకుండా పోతున్నది. వారి నోటికి అడ్డూఅదుపు ఉండడం లేదు. రాంగ్ రూట్‌లో రావడమే కాకుండా వాహనదారులపై ఇద్దరు కాంగ్రెస్ నాయకులు దుర్భాషలాడి వీరంగం సృష్టించారు. వివరాల్లోకి వెళ్తే.. పరిగి పట్టణ శివారులో షాద్‌నగర్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసి వెళ్లేందుకు దోమ పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతకుమార్ తమ కారును రాంగ్ రూట్‌లో తీసుకెళ్లి వాహనాలకు అడ్డుగా నిలిపారు. ఎదురుగా వస్తున్న పాల ట్యాంకర్ డ్రైవర్‌పై బూతులతో విరుచుకుపడ్డారు. అలాగే వారికి నచ్చజెప్పేందుకు యత్నించిన ఆర్టీసీ ప్రయాణికులనూ దుర్భాషలాడారు. తాము కారు తీసేది లేదు, ఎవరికీ చెప్పుకొంటారో చెప్పుకోండంటూ వీరంగం సృష్టించారు. తమను ఎవరూ ఏమి చేయలేరంటూ నానా హంగామా చేశారు. మద్యం మత్తులో వారు చేసిన వీరంగంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. పట్టపగ లు రాంగ్ రూట్‌లో రావడమే కాకుండా ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదని పలువురు పేర్కొన్నారు. ఇరువురు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి కూడా అడ్డదిడ్డంగా వ్యవహరించడంతో పార్టీకి చెడ్డపేరు వస్తుందని ఆ పార్టీ నాయకులే పేర్కొంటున్నారు. ఆ ఇద్దరు కాంగ్రెస్ నాయకులు చేసిన హంగామా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై చర్చ

సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ విషయంలో వివాదాలకు ఆస్కారం లేకుండా నాలుగు నెలల్లో పరిష్కారం చూపుతామని లేక్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. హైడ్రా కార్యాలయంలో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ విషయంలో గతంలో హెచ్ఎండీఏ ఇచ్చిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలను పరిసరవాసుల నుంచి రంగనాథ్ శుక్రవారం స్వీకరించారు. వారి వాదనలను రికార్డు చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఒకసారి ఒకలాగా, మరొకసారి మరో మాదిరిగా ఉంటుందని, ఒక్కో శాఖ ఒక్కో తరహాలో ఎఫ్‌టీఎల్ లెక్కలు చెబుతున్నాయని వారు ఆరోపించారు. మిగతా చోట్ల చెరువులు మాయమైతే ఇక్కడ మాత్రం చెరువు ఎఫ్‌టీఎల్ పెరుగుతున్నదని, ఇదెక్కడి వింత అంటూ వారు కమిషనర్‌ను అడిగారు. 25 ఏండ్లుగా ఎఫ్‌టీఎల్ వివాదం కొనసాగుతున్నదని, అప్పుడు వచ్చిన వరదల వల్ల వచ్చిన నీటి పరిమాణంతో ఎఫ్‌టీఎల్ మార్చేశారని, ప్రభుత్వ రికార్డుల్లో 65 ఎకరాలే ఉంటే 165 ఎకరాలు ఎఫ్‌టీఎల్‌గా చూపిస్తున్నారని ఆరు కాలనీలకు చెందిన ప్రతినిధులు కమిషనర్‌కు చెప్పారు. ఖాళీ స్థలాల్లో ఇళ్లు కట్టుకోలేకపోతున్నామని, అవసరాలకు తమ ఇళ్లు అమ్ముకోలేకపోతున్నామని వారు వాపోయారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారించినప్పుడు తమ వాదనలు పరిగణనలోకి తీసుకోవాలని వారు కమిషనర్‌ను కోరారు. కాలనీవాసుల నుంచి పూర్తి అభ్యంతరాలు తీసుకున్న తర్వాత రంగనాథ్ మాట్లాడుతూ, ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తదితర శాఖలన్నింటినీ భాగస్వామ్యం చేసి పరిష్కారం చూపుతామని తెలిపారు. నాలుగు నెలల్లో ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఎఫ్‌టీఎల్ విషయంలో శాస్త్రీయంగా వ్యవహరిస్తామని, ఐఐటి, బిట్స్ పిలానీ, జేఎన్టీయూ వంటి విద్యా సంస్థల ఇంజనీరింగ్ విద్యార్థుల సహకారం కూడా తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. సమావేశంలో దుర్గం చెరువు పరిసర ప్రాంతంలోని ఆరు కాలనీలకు చెందిన ప్రతినిధులు గోపాలకృష్ణ, ఊర్మిళాదేవి, నళినీ, జేవీ చౌదరి, రవీందర్ రెడ్డి, ప్రియతమ్ రెడ్డి, బాషా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

బల్దియా ఖజానాకు 'సర్వే' గండి..!

- అదనపు భారంతో పెరగని ఆస్తిపన్ను వసూళ్లు
- ఈ ఆర్థిక సంవత్సరం రూ. 1,970 కోట్ల లక్ష్యం
- ఇప్పటి వరకు రూ.1,407 కోట్లు మాత్రమే వసూళ్లు
- రానున్న రెండున్నర నెలల్లో రూ. 563 కోట్ల టార్గెట్

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ): మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా 'ఇందిరమ్మ ఇండ్ల సర్వే' బల్దియాకు సరికొత్త తంటాను తెచ్చిపెట్టింది. సంస్థకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను వసూళ్లపై ఈ సర్వే ప్రభావం పడుతున్నది. గడిచిన కొన్ని నెలలుగా ఆస్తిపన్ను వసూళ్లలో కీలకమైన బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లపై వరుసగా వస్తున్న సర్వేల అదనపు భారం పడుతున్నది. వీరు ఒక పక్క సర్వేలు, మరో పక్క ట్యాక్స్ వసూలు పనులు చేయాల్సి వస్తున్నది. సర్వే కారణంగా ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కావడం లేదని చెబుతున్నారు. గడిచిన రెండు, మూడు నెలలుగా నెలవారీగా ఆస్తిపన్ను రూ. 50కోట్లు దాటడం లేదని అధికారులు చెబుతున్నారు. వసూళ్లు తగ్గడంతో సంస్థ ఖజానాపై తీవ్ర ప్రభావం పడి.. నెలవారీ వేతనాలు సకాలంలో అందలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలోనే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇండ్ల సర్వేతో ఆస్తిపన్ను వసూళ్లు సరిగా లేకపోవడం, రాబోయే రోజుల్లో 26వ తేదీ నుంచి రేషన్ కార్డుల సర్వే, అనంతరం పింఛన్ల సర్వే, గృహలక్ష్మి సర్వే కూడా చేయాల్సి వస్తుందన్నారు.

వైట్ నోటీసులు జారీ..

మొత్తం 19.49 లక్షల ప్రాపర్టీలు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ. 1407 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. 12 లక్షల మంది ఆస్తిపన్ను చెల్లించారు. మార్చి 31 నాటికి రూ. 563 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అత్యధికంగా శేరిలింగంపల్లి, చందానగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రధానంగా దృష్టి సారించారు. దాదాపు ఆరు లక్షల మందికి వైట్ నోటీసులు జారీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండు నెలల 20 రోజుల సమయం మాత్రమే ఉన్నది. ఈ ఏడాది టార్గెట్ రూ.1970 కోట్లలో ఇంకా రూ. 563 కోట్ల కలెక్షన్లు రావాల్సి ఉన్నది. మార్చి 31 వరకు లక్ష్యాన్ని చేరుకోవాలని సర్కిల్ డిప్యూటీ కమిషనర్లకు కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. అయితే నిర్ణీత సమయంలో ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం చేరడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జీతాలు పెంచుతామంటూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాల్స్

ఒక్కొక్కరి నుంచి రూ. వెయ్యి నుంచి 2వేలు వసూలు

చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ ఎంపీ అనుచరులు

జీహెచ్ఎంసీలో నయా దందా మొదలైంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే లక్ష్యంగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. గడిచిన కొద్ది రోజులుగా జీహెచ్ఎంసీ జోనల్, సర్కిల్ అన్ని కార్యాలయాల్లోని ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు, డేటా ఆపరేటర్లకు జీతం పెంచుతామని కొందరు కాల్స్ చేస్తున్నారు. 625 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జాబితాను దగ్గర పెట్టుకుని జీతం పెంచుతాం, అందుకు నుంచి రూ. వెయ్యి నుంచి రెండు వేల వరకు రేటును ఖరారు చేశామని చెబుతూ.. గూగుల్ పే నంబర్ పంపుతూ వసూళ్లకు పాల్పడుతున్నారు. జీతం పెరిగిన తర్వాత రెండు నెలల జీతం ఇవ్వాలని అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు ఇప్పటికే డబ్బులు సమర్పించుకోగా, మరి కొందరు సందిగ్ధంలో ఉన్నామని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ వసూళ్ల దందాలో నల్గొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనుచరులు ఉన్నారని, ఓ మహిళా నేత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని అడ్మిన్ విభాగంలో కొందరి ప్రమేయంతో ఇటువంటివి చేస్తున్నారని ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుతం ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

ఆర్డీవోతో జరిగిన సమావేశంలో పాల్గొన్న రాచులూరు గ్రామ రైతులు

కన్జర్వేషన్ జోన్ ఎత్తివేయాలి

రాచులూరు రైతుల డిమాండ్.. ఆర్డీవోతో సమావేశం

కందుకూరు, జనవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కన్జర్వేషన్ జోన్ ఎత్తివేయాలని కందుకూరు మండల పరిధిలోని రాచులూరు రైతులు డిమాండ్ చేశారు. తమ భూములు ఎకరాకు రూ.4 కోట్ల ధర పలుకుతున్నాయని.. అందులో సగం ధర చెల్లించి వాటిని తీసుకోవాలని కోరారు. బేగర కంచె వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫోర్త్‌సిటీ రోడ్డుతో భూములు కోల్పోతున్న రాచులూరు గ్రామ రైతులతో శుక్రవారం ఆర్డీవో తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 23 లక్షలు ఎకరాకు ఉందని 2013 చట్టం ప్రకారం, మూడు రెట్లు చెల్లిస్తుండటంతో ఎకరాకు రూ.70 లక్షలు వస్తుందని ఆయన వారికి వివరించారు. అందుకు రైతులు సమ్మతించ లేదు. తమకు ఉన్న ఎకరం, రెండు ఎకరాలు రోడ్డు నిర్మాణంలో పోతే తమకు జీవోనోపాధి కష్టం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెల్లిస్తానని చెబుతున్న నష్ట పరిహారం సరిపోదని, ప్రస్తుతం పలుకుతున్న ధర కంటే తగ్గించి కనీసం ఎకరాకు 2 కోట్ల కు పైగా చెల్లించాలని కోరారు. అంతేకాకుండా తమ భూములు కన్జర్వేషన్ జోన్‌లో ఉన్నాయని వెంటనే ఆ జోన్‌ను ఎత్తివేయాల ని విజ్ఞప్తి చేయగా.. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో రైతులకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, రైతులు బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుయ్యని సామయ్య, సుదర్శన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు

స్వచ్ఛంద సంస్థల చేయూత ఆదర్శనీయం

హెచ్ఎండీఏ కమిషనర్

మణికొండ, జనవరి 10: పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఆదర్శనీయ నిర్ణయమని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట కొత్త చెరువును జీఈఎఫ్ ఇండియా సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది.

ఈ సందర్భంగా శుక్రవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవత్స, మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డిలతో కలిసి రూ.కోటీ20 లక్షల సీఎస్ఆర్ నిధులతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో తమతోపాటు తోటి వారికి చేయూత అందించేందుకు జీఈఎఫ్ ఇండియా ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌పర్సన్ మైలారం నాగపూర్ణాశ్రీనివాస్, జీఈఎఫ్ ప్రతినిధులు అక్షయ్ చౌదరి, అర్చన సురేశ్, ప్రతాప్, మధులి చౌదరి తదితరులు పాల్గొన్నారు.